
## వాల్టా చట్టంపై అవగాహన కార్యక్రమం



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## ఫైనల్‌లో ఒడిశా.. ఖమ్మం గెలిచింది



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 163 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 09 జూన్ 2026



### రాష్ట్రంలో పాఠశాలలను

# కుదించే కుట్ర

**- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కవిత**

**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సమీకృత పాఠశాలలు నిర్ణయంపై టిఆర్ఎస్ చీఫ్ కె.కవిత మండిపడ్డారు. రాష్ట్రంలోని 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు సిఎం ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

మిగతా2లో...

### రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..

# గుజరాత్‌కు గులాంగిరి

● మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుకుంటున్నారు ● సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన ● రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం ● కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ మిగతా2లో...




### మోడీ పాలనతో

# చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

మిగతా2లో...

### అంగీకారం ఉన్న సంబంధాన్ని

# తప్పుపట్టలేం

- అది వ్యక్తిత్వంపై మచ్చ కాదు : సుప్రీం వ్యాఖ్యలు
- అంగీకారం ఉన్న సంబంధాన్ని తప్పుపట్టలేం



2లో

### విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో

# ఘోర ప్రమాదం

9 మంది మృతి, పలువురికి గాయాలు

స్టీల్‌ప్లాంట్‌లో ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ప్రమాదం




2లో

### బిహార్‌లో

# రోడ్డు ప్రమాదం..

**ముగ్గురు నెల్లూరు జిల్లా వాసులు మృతి**



**అమరావతి,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తీర్థయాత్రలకు బయలు దేరిన నెల్లూరు జిల్లా వాసుల బస్సుకు ప్రమాదం జరిగి ముగ్గురు యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. లారీని ఓవర్ టేక్ చేయబోయిన యాత్రీకుల ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. మృతులు హజరయ్య, వెంకటేశ్వర్లు, పద్మావతిగా గుర్తించారు.జిల్లాలోని సంగం,ఆత్మకూరు, దుత్తలూరు గ్రామాలకు చెందిన 43 మంది మిగతా2లో...

### మహిళా శక్తి మహాసభకు

# సర్వం సిద్ధం

- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ పిలుపు



**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న మిగతా2లో...

### పకడ్బందీగా

# ఎస్ఐఆర్ ప్రక్రియ

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సహకారం
- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి




**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ పక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్ లు పెట్రోలింగ్ ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో మిగతా2లో...

### సంక్షేమ రాజ్య నిర్మాణం..

# ప్రజాప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ. 110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు మిగతా2లో...



### హోర్ముజ్ జలసంధి

# మూసివేత

- సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

**న్యూఢిల్లీ,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్

మిగతా2లో...

### బిజెపి అధికారంలోకి వస్తే.. సింగరేణి

# కార్మికులకు కిషన్ రెడ్డి హామీ



**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమ సమయంలో సింగరేణిలో యాత్ర చేశానని, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సింగరేణి ఉద్యోగుల ఇన్ కమ్ టాక్స్ మినహాయింపు చేస్తానని బిజెపి నాయకుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను అడిగినా చేయలేదని, 2028లో అధికారంలోకి రాగానే ఖచ్చితంగా వారికి ఆదాయపుపన్ను మినహాయింపు ఇస్తామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో గత 12 ఏళ్లలో జరిగిన అభివృద్ధి, సంస్కరణలపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణికి

సంబంధించి రెండేళ్లలో ఖర్చులు తగ్గించే ప్రయత్నం చేశానని, కోలిండియాతోపాటుగా సింగరేణి ఉద్యోగస్తులకు ఇన్సూరెన్స్ పెంచామని, గతంలో 30 లక్షలు, 40 లక్షలుండే ప్రమాదబీమాను నేడు కోటి రూపాయలకు పెంచామని చెప్పుకొచ్చారు. ఓపెన్ క్యాస్ట్ మైనింగ్‌ను తగ్గించేందుకు మిగతా2లో...

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

(మొదటి పేజీ తరువాయి)

చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, త్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు గులాంగిరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ. 1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ. 200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు.

కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ. 161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

# సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ను ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ. 5 లక్షల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ. 500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అదె బస్సుల హైర్ చార్జీల కింద రూ. 20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ. 199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ. 10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

## - డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన సమయంలో రాము నాయిక్ చేసిన భారీ అక్రమాలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్‌లో గజం రూ. 2 లక్షలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు తేల్చారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలనలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూములను కాజేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలకు పాల్పడిన అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# బిహార్‌లో రోడ్డు ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులు కాశీ యాత్రకు బయలు దేరారు. ఆదివారం గయ్య పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని వారణాసికి వెళ్తుండగా ఔరంగాబాద్ జిల్లాలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో 15 మందికి గాయాలయ్యాయి. వీరిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. మరణవార్త తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనిత, మంత్రులు నారాయణ, ఆనం రాంనారాయణ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

**విశాఖ,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** విశాఖ స్టీల్ ప్లాంట్లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉక్కుకర్మాగారంలోని ఎస్ఎంఎస్-2, ఎస్టీసీ-3, హీట్ ఎఫ్జీలో భారీ మొత్తంలో ఉక్కుద్రవం లీకవ్వడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టుగా తెలుస్తోంది. ప్రమాదంలో పది మంది తీవ్రంగా గాయపడినట్టు గా సమాచారం. కాగా మంటలు చెలరేగడంతో కార్మికులు, ఉద్యోగులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు స్టీల్ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది చర్యలు చేపట్టారు. ప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి.. విశాఖ స్టీల్ప్లాంట్లో జరిగిన ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆయన అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయక చర్యల గురించి స్టీల్ ప్లాంట్ అధికారులు సీఎంకు వివరించారు. అన్నిశాఖల సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# అంగీకారం ఉన్న సంబంధాన్ని తప్పుపట్టలేం

**న్యూఢిల్లీ,జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** వివాహానికి ముందు పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం, వ్యక్తిత్వానికి మచ్చ కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. అటువంటి సంబంధాన్ని ఆ వ్యక్తి గుణానికి మచ్చగా పరిగణించలేమని పేర్కొంది. అధికారులు మారుతున్న సామాజిక ప్రమాణాల పట్ల సున్నితంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించింది. జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. క్రమశిక్షణ కలిగిన బలగాల్లో రిక్రూట్‌మెంట్ సమయంలో వ్యక్తిత్వ ధృవీకరణ అనేది అంతర్భాగంగా కొనసాగుతుందని, కానీ సమకాలీన సమాజంలో వివాహ పూర్వ సంబంధాలు సర్వసాధారణమవుతున్నాయని పేర్కొంది. అందువల్ల వీటిని ఒక వ్యక్తి వ్యక్తిత్వంపై నింద వేయడానికి సాకుగా ఉపయోగించరాదని పేర్కొంది. నేటి సమాజంలో మారుతూ వస్తున్న పరిస్థితులను అధికారులు కూడా గమనంలోకి తీసుకోవాలని కోరింది. పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థి సెలక్షన్‌ను తెలంగాణా రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు రద్దు చేసిన కేసులో ఈ రూలింగ్ వెలువడింది. సదరు అభ్యర్థి విఫలమైన ప్రేమ వల్ల తలెత్తిన క్రిమినల్ కేసులో వున్నందుకు ఆ సెలక్షన్‌ను రద్దు చేశారు. దీనిపై ఆ అభ్యర్థి చేసుకున్న అప్పీల్‌ను విచారణకు స్వీకరిస్తూ, డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. అంతకుముందు తెలంగాణా హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పునరుద్ధరించింది.

# హోర్ముజ్ జలసంధి మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చున్నారు.

# పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పక్రియ ఈనెల 25.06.2026 నుండి ప్రారంభం అవుతుందని, కావున బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, తిరిగి వాటిని సేకరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ ఐ ఆర్ పక్రియలో పాల్గొనే బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ల పేర్లను, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమన్వయం చేసుకోవడానికి పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లను కూడా ఎన్నికల అధికారులు సేకరించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే పక్రియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈఓలను ఆదేశించారు. ఈసందర్భంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొనే అన్ని బీఎల్‌ఓలు, ఇతర అధికారులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు / డీఈఓలు, ఆయా జిల్లాల పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ సీఈఓ (ఎఫ్ఏసీ), నోడల్ అధికారులు, పీఎం-ఐటీ, ఇతర సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సిఎం కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇప్పుడు పాఠశాలలు మూసివేస్తున్నామని ప్రకటించారని, విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అన్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# బిజెపి అధికారంలోకి వస్తే.. సింగరేణి కార్మికులకు కిషన్ రెడ్డి హామీ

(మొదటి పేజీ తరువాయి)

అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్నామని, ప్రయివేట్ మైనింగ్, కమర్షియల్ మైనింగ్ కారణంగా ఉద్యోగాలు పెరుగుతున్నాయన్నారు. కమర్షియల్ మైనింగ్ ద్వారా 800 మిలియన్ టన్నుట బొగ్గు ఉత్పత్తి జరగడంతో పాటు దానికి అనుగుణంగా ఉద్యోగాల కల్పన పెరుగుతుందని తెలిపారు.

# ఓటరు జాబితా అనామలీలపై సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయి తనిఖీ







**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వం, పారదర్శకత లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు నెం.84, 85, 86, 87లలో గుర్తించిన అనామలీల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో నమోదైన అన్‌మ్యాప్డ్ కేసులు, డూప్లికేట్ నమోదులు, చిరునామా మార్పులు, కుటుంబ అనుసంధాన సమస్యలు తదితర అంశాలను పరిశీలించి వాటి పరిష్కారానికి అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు నిర్వహిస్తున్న ఇంటింటి ధృవీకరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి కేసును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలు మాత్రమే జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి, ఓటరు జాబితాలోని లోపాలను త్వరితగతిన సరిదిద్దాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అనామలీ కేసులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యం

### ఏడు కీలక అంశాలపై గ్రామసభ

### లింగాలలో కన్వర్జెన్స్ గ్రామసభ

### పరిశుభ్రత, ప్రజారోగ్యం, ఓటరు జాబితాపై అవగాహన



**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మండల స్థాయి వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సోమవారం లింగాల గ్రామంలో కన్వర్జెన్స్ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వేము కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఎంపీడీవో చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, వర్షాకాల సంసిద్ధత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర ఏడు కీలక అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026 ప్రకారం ఇంటి వద్దనే పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేరు చేసి గ్రామ పంచాయతీ ద్వారా సక్రమంగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యర్థాల రీసైక్లింగ్, కంపోస్టింగ్ ద్వారా ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువల పూడిక తొలగింపు, లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వల నివారణ, రహదారుల మరమ్మతులు, వర్షపు నీటి పారుదల ఏర్పాట్లను ముందుగానే చేపట్టాలని సూచించారు. ప్రతి వర్షం అనంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. సురక్షిత తాగునీటి సరఫరా కోసం నీటి ట్యాంకుల శుభ్రత, అవశేష క్లోరిన్ పరీక్షలు, పైప్‌లైన్ లీకేజీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ నీటి నిల్వ పాత్రలను శుభ్రపరచాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. విపత్తుల సమయంలో గ్రామస్థాయిలో అత్యవసర ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాబోయే హరితహారం కార్యక్రమానికి అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కల పెంపకానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితాపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సరిచూసుకుని నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# ఫైనల్‌లో ఓడినా.. ఖమ్మం గెలిచింది











### - రాష్ట్ర రగ్బీ వేదికపై సత్తా చాటిన ఖమ్మం బాలికలు

### - తొలిసారి బరిలోకి దిగి రన్నరప్‌గా చరిత్ర సృష్టించిన ఖమ్మం గర్ల్స్ రగ్బీ టీమ్.. తెలంగాణకే స్ఫూర్తిపాఠం!

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆటలో ఓటమి కేవలం ఒక అంకె మాత్రమేనని.. పట్టుదల ఉంటే తొలి అడుగులోనే చరిత్ర సృష్టించవచ్చని నిరూపించారు ఖమ్మం జిల్లా అండర్-18 బాలికల రగ్బీ జట్టు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట్‌లోని 'ఒక్షేన్ యూనివర్సిటీ' వేదికగా మే 5, 6 తేదీలలో జరిగిన 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఖమ్మం బాలికల జట్టు రన్నర్స్‌గా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఒక్క ట్రై తేడాతో ఫైనల్లో టైటిల్ చేజారినప్పటికీ, మైదానంలో వారు ప్రదర్శించిన పోరాట పటిమ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి హృదయాలను గెలుచుకుంది. **ఓటమి కాదు ఇది అద్భుత ఆరంభం..** తొలిసారి స్టేట్ లెవల్ ఫైనల్లో అడుగుపెట్టిన ఈ జట్టు, ఎంతో అనుభవమున్న మెదక్, యాదాద్రి లాంటి బలమైన జట్లను మట్టికరిపించి ఫైనల్ చేరడం సామాన్యమైన విషయం కాదు. మైదానంలో ఆడుతున్నంత సేపు కప్పు గెలవాలనే కసితో పాటు, జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలనే తపన వారి ప్రతి కదలికలోనూ కనిపించింది. "ఓడిన ప్రతిసారీ మరింత బలంగా లేవడమే నిజమైన ఛాంపియన్ లక్షణం" అని కోచ్ రఘు నాయక్ క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. ఓటమిని అంగీకరిస్తూనే, "మేము ఓడిపోలేదు.. మా ప్రయాణం ఇప్పుడే మొదలైంది, వచ్చే ఏడాది గోల్డ్ మెడల్‌తోనే తిరిగి వస్తాం" అంటూ బాలికలు చాటిన ఆత్మవిశ్వాసం వేలాది మంది గ్రామీణ ప్రాంత ఆడపిల్లలకు సరికొత్త స్ఫూర్తినిస్తోంది. **ఉచిత శిక్షణ.. గుండె నిండా ప్రోత్సాహం : తెరవెనుక సూత్రధారులు** ఈ చారిత్రాత్మక విజయం వెనుక క్రీడాకారుల చెమటతో పాటు, వారిని వెన్నంటి నడిపించిన గురువుల త్యాగం, కృషి ఎంతో ఉంది. జిల్లా రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, పిడి భూక్యా రఘునాయక్ జిల్లాలో రగ్బీ క్రీడను బతికించేందుకు, నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయన చేసిన త్యాగం మరువలేనిది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమల్ల గ్రామంలో (మే 24 నుండి 28 వరకు), ఖమ్మం ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (జూన్ 1 నుండి 3 వరకు) మొత్తంగా 32 మంది బాలబాలికలకు స్వంత ఖర్చులతో ఉచిత భోజన సౌకర్యాలు కల్పించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పి. సునీత మేడం (పిఈటి), బి. యశ్వంత్ (సీనియర్ క్రీడాకారుడు) టీమ్ మేనేజర్లుగా వ్యవహరిస్తూ, బాలికలకు మానసిక ధైర్యాన్ని నూరిపోస్తూ, మైదానంలో ప్రతి క్షణం వారికి మార్గదర్శకులుగా నిలిచారు. **జాతీయ స్థాయి రేసుకు ఖమ్మం బిడ్డలు!** ఈ టోర్నీలో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి పోటీలకు ఖమ్మం జిల్లా నుండి ఐదుగురు క్రీడాకారుల పేర్లను అసోసియేషన్ ప్రతిపాదించింది. **బాలికల విభాగం : ఎస్.కె హాశ్రిన్, ఎస్.కె సమ్రీనాజ్, డి. హిమవర్షిని.** బాలుర విభాగం : వి. ప్రశాంత్, ఎన్. శరణ్ సాయి (బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది). **టోర్నీలో పాల్గొన్న ఖమ్మం రత్నాలు :** బాలికలు : ఎస్.కె హాశ్రిన్, ఎస్.కె సమ్రీనాజ్, బి. కరుణ, డి. హిమవర్షిని, బి. సునీత, కొరకొప్పుల కమల్ శైనీ, పిల్లలమర్రి రిషిత. బాలురు: బి. వీర జగన్ మోహన్ నాయక్, ఎన్. శరణ్ సాయి, వి. ప్రశాంత్, బి. వీరబ్రహ్మం, పి. నగేష్, బి. విష్ణువర్ధన్, ఎం గోపీచంద్, ఎస్. సిద్దు, జి. కళ్యాణ్, వై. వేణుమాధవ్, కె. రామ్ స్నేహిత్. తమకు అండగా నిలిచి, ఉచిత శిక్షణతో ఒక కలని నిజం చేసిన ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్‌కు, కోచ్ రఘు నాయక్ బృందానికి క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రన్నరప్ ట్రోఫీ కేవలం ఒక కప్పు కాదు.. కష్టాలెన్ని ఎదురైనా సాధించగలమనే ఖమ్మం ఆడబిడ్డల నమ్మకానికి నిదర్శనం!

# ఘనంగా ఎస్ఐ తేజస్వర్ రెడ్డి ఎంగేజ్‌మెంట్ వేడుక

- నూతన జంటను ఆశీర్వదించిన ఉపసర్పంచ్ బానోతు శ్రీను



**రఘునాధపాలెం, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తేజస్వర్ రెడ్డి ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది. ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ శుభకార్యానికి పలువురు ప్రజాప్రతినిధులు, సన్నిహితులు హాజరై నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రఘునాధపాలెం మండలం హర్యాతండా ఉపసర్పంచ్ బానోతు శ్రీనునాయక్‌తో పాటు రాంబాబు, రమేష్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం ఆనందమయం, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకోగా, నూతన జంట జీవితంలో ఇది మరపురాని మధుర ఘట్టంగా నిలిచింది.

# వాల్టా చట్టంపై అవగాహన కార్యక్రమం

- 99 రోజుల ప్రణాళికలో భాగంగా అవగాహన కల్పించిన తల్లాడ రేంజర్ ఉమా



**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా అటవీశాఖ కార్యక్రమాలపై జూన్ 1 నుండి 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా జూన్ 8న అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వోల్టా చట్టంపై సర్పంచులకు అవగాహన కల్పించినట్లు తల్లాడరేంజర్ ఉమా తెలిపారు. అడవుల రక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా వోల్టా చట్టం పనిచేస్తుందని తెలిపారు. నీరు, భూమి మరియు వృక్షాల సంరక్షణతో సమతుల్యత ఏర్పడి మానవాళి జీవితం ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తు తరాలకు మనం అందించి చిరుకానుకగా చెట్లను పెంచాలని అన్నారు. చెట్లను నాటడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని వన్యప్రాణులు, పశుపక్షాదులు జీవించడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. అడవులను నరకడం వల్ల జీవనాధారం లేక కోతులు, జంతువులు జనసమూహం లోకి రావడంతో కొత్త కష్టాలను కొని తెచ్చుకున్నట్లు తెలిపారు. అడవులను వన్యప్రాణులను భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డిఆర్ఓ రవికుమార్, గట్టుగూడెం డిఆర్ఓ సురేష్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ కిషోర్, అటవీశాఖ సిబ్బంది, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణదాతగా నిలిచిన పాలెపు గోపి కృష్ణ

- రక్తదానంతో అనారోగ్య బాధితుడికి నూతన జీవం




**రఘునాధపాలెం, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈర్లపూడి గ్రామానికి చెందిన యువకుడు పాలెపు గోపి కృష్ణ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకుని మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. లివర్ ఇన్ఫెక్షన్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న కాల్వొడ్డు ప్రాంతానికి చెందిన ప్రసాద్‌కు అత్యవసరంగా రక్తం అవసరమైన విషయం తెలుసుకున్న గోపి కృష్ణ వెంటనే స్పందించి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడికి అండగా నిలిచారు. అత్యవసర సమయంలో ఎలాంటి సంకోచం లేకుండా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా గోపి కృష్ణ తన గొప్ప మనసును మరోసారి చాటుకున్నారు. ఆయన చేసిన ఈ సేవతో ప్రసాద్ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకోగా, గోపి కృష్ణపై కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగా ఉందని నిరూపించే విధంగా గోపి కృష్ణ చేసిన ఈ రక్తదానం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం, ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం వంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినివ్వాలని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. రక్తదానం మహాదానం అని మరోసారి నిరూపించిన పాలెపు గోపి కృష్ణ సేవాభావాన్ని స్థానికులు, యువత ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. ఇలాంటి మానవతా కార్యక్రమాలు సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందించి, మరెందరో రక్తదాతలు ముందుకు రావడానికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# ఘనంగా చిన్నారుల ఓణీల అలంకరణ, పంచెకట్టు వేడుక

**ఆశీర్వదించిన ఆకుల గాంధీ, శీలంశెట్టి వీరభద్రం, ఆకుతోట ఆదినారాయణ తదితర ప్రముఖులు**





**ఖమ్మం,ప్రతినిధి జూన్ 8 పిసిడబ్ల్యూ న్యూస్):**జిల్లా తనికెళ్ల గ్రామంలో చిన్నారులు రిత్విక్శ్రీ, అభిరామ్‌ల ఓణీల అలంకరణ మరియు పంచెకట్టు వేడుకలు ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ తదితర ప్రముఖులు వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. తనికెళ్లకు చెందిన యాసా విష్ణుమూర్తి తులిశమ్మల ప్రథమ కుమారుడు తిరుపతిరావు, కోడలు మమత దంపతుల కుమార్తె రిత్విక్శ్రీ ఓణీల అలంకరణ, కుమారుడు అభిరామ్ పంచెకట్టు కార్యక్రమాలు స్వగృహంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించగా, కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆకుల సురేష్, బండి లక్ష్మీనారాయణ, బండి చిన్న వెంకటేశ్వర్లు, యాసా సత్యనారాయణ, లేడిపోయిన నాగేశ్వరరావు తదితరులు హాజరై అక్షింతలు వేసి చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆశీర్వది ంచారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకకు హాజరైన అతిథులు చిన్నారులు విద్య, సంస్కారం, సద్గుణాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ తమ ఆశీస్సులు అందజేశారు. కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించడంతో కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిసింది.

# ప్రభుత్వ భూమిని కాపాడండి: సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్



**చిట్యాల, జూన్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి జయశంకర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ లో చిట్యాల మండల కేంద్రంలో ఉన్న సర్వే నంబర్ 59 బై ఒకటి లో ఎనిమిది గుంటల ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి భూమిని కాపాడి ప్రభుత్వ గోదాం నిర్మించాలని సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ కోరడం జరిగింది జిల్లా నాయకులు బందు సుజాత బుర్ర స్వాతి పాల్గొన్నారు.

# నూతన గ్రామ కార్యదర్శికి సన్మానించిన గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లు



**తొర్రూరు ప్రతినిధి, జూన్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామ పంచాయతీకి నూతనంగా వచ్చిన గ్రామ కార్యదర్శి భూక్య సుధాకర్ ను సన్మానించారు. గతంలో ఇదే స్థానంలో ఉన్న కార్యదర్శి రబ్బాని గత కొద్ది రోజులుగా ఇక్కడి గ్రామపంచాయతీలో విధులు నిర్వహించి వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి బదిలీ కావడంతో ఆస్థానంలో నూతనంగా నర్సంపేట, గూడూరు నుండి భూక్య సుధాకర్ ఈ గ్రామ పంచాయతీకి గత నాలుగు రోజుల క్రితం నూతనంగా రావడం జరిగింది. నూతనంగా వచ్చిన కార్యదర్శికి గ్రామ సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ, ఉప సర్పంచ్ పంజాల మహేష్ మరియు వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవితా బాలకృష్ణ ప్రసంగిస్తూ గ్రామాభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో గ్రామ కార్యదర్శి కీలకపాత్ర పోషిస్తారని పేర్కొన్నారు గ్రామ ప్రజల సంక్షేమం కోసం గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యదర్శి భూక్య సుధాకర్ ప్రసంగిస్తూ గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది ,గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని గ్రామ కార్యదర్శి శుభాకాంక్షలు తెలిపారు.




# మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**• మంత్రి పొంగులేటికి సయ్యద్ సాదిక్ అలీ వినతి**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించి వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ సాదిక్ అలీ మాట్లాడుతూ, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2.20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2.5 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమైన షాదీఖానా నిర్మించాలని కోరారు. అలాగే ముస్లిం సోదరుల ఖననాల కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఖబరస్తాన్‌గా కేటాయించి, రెవెన్యూ శాఖ ద్వారా హద్దులు నిర్ణయించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్లెగూడెం ప్రాంతంలో మసీదు నిర్మాణం కోసం 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు, పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపల్ పరిధిలో జనాజా వాహనం అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వెంటనే వాహనం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఈద్గా స్థలాన్ని ఫ్లోరింగ్ చేసి ప్రార్థనలకు అనువుగా తీర్చిదిద్దాలని తెలిపారు. మైనార్టీ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించి కుట్టు మిషన్లు వంటి ఉపాధి సాధనాలను పంపిణీ చేయాలని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి అర్హులైన మైనార్టీలకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీలో వృత్తి విద్యా కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మైనార్టీల సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఈ వినతులను సానుకూలంగా పరిశీలించాలని సయ్యద్ సాదిక్ అలీ కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు, మైనార్టీ ప్రతినిధులు, నజీరుద్దీన్ మహమ్మద్ హుస్సేన్ అల్లా బకాష్ జానీ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచినీళ్లపల్లి చెరువులో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు



**మల్లంపల్లి మండల ప్రతినిధి, జూన్08 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి గ్రామ పరిధిలోని మంచినీళ్లపల్లి చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) ద్వారా చేపట్టిన పూడికతీత పనులను గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చెరువుల పూడికతీత ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు చెరువుల నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. చెరువులోని సారవంతమైన నల్ల మట్టిని రైతులు తమ వ్యవసాయ భూములకు తరలించుకోవడం వల్ల అది సహజ ఎరువుగా ఉపయోగపడి పంట దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే చెరువుల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడం వల్ల పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టాలు పెరిగి రైతులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్, వార్డు సభ్యుడు కొంగరి నరేందర్, టీపే సాలయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి, రామ్ రెడ్డి, గొర్రె కుమార్, విజేందర్ రెడ్డి, మోసిన్, మంద కుమార్, కర్ణాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కోకిల శీను తదితరులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. హెడ్‌లైన్: "మంచినీళ్లపల్లి చెరువులో పూడికతీత పనుల ప్రారంభం ఉపాధితో పాటు వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు: సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు"

# గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

**- రూ.97 లక్షల సుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రారంభం**

**- రఘునాథపాలెం మండలం వి.వి.పాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల**











**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పం చ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.20 వేల ఆర్థిక సాయం




**రామడుగు, జూన్ 08 (పీ.సి.డబ్ల్యూ. న్యూస్):**రామడుగు గ్రామానికి చెందిన పల్లాటి చంద్రయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఎన్నారై తోట సత్యం మానవత్వం చాటుకున్నారు. చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని కర్ణె శ్రీనివాస్, సముద్రాల శ్రీనివాస్‌లు తోట సత్యంకు తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని చందా అనిల్, కర్ణె శ్రీనివాస్, జెట్టిపెల్లి అశోక్, సిరిగిరి వెంకటేష్, సముద్రాల శ్రీనివాస్, రామడుగు అశోక్‌ల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పల్లాటి చంద్రయ్య కుటుంబ సభ్యులు తమ కష్టసమయంలో ఆదుకున్న తోట సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తోట సత్యం చేసిన ఈ సహాయం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని గ్రామస్థులు అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి: బీజేపీ కార్పొరేటర్లు

● ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పణ




కొరకు విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేయవలసిందిగా విన్నపం.

నమస్కారములు.

రానున్న నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో, కరీంనగర్ కార్పొరేషన్ (నగరపాలక సంస్థ) పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత మరియు మౌలిక వసతులపై మీ దృష్టికి కొన్ని ముఖ్యమైన విషయాలను తీసుకురావాలని ఈ వినతి పత్రాన్ని సమర్పిస్తున్నాము.

ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో పెద్ద సంఖ్యలో చెట్లు ఎండిపోయి, బలహీనంగా మారాయి. వర్షాలు లేదా ఈదురుగాలులు వీచినప్పుడు ఈ ఎండిన చెట్లు/కొమ్మలు విరిగిపడి విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపే విద్యాశాఖ మరియు నగరపాలక సంస్థ అధికారుల సమన్వయంతో వీటిని గుర్తించి, తక్షణమే తొలగించాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది.

దీనితో పాటు, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో క్రింది మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది:

- మధ్యాహ్న భోజన కిచెన్ షెడ్లు: పలు పాఠశాలల్లో వంట గదులు (Kitchen Sheds) శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల సరైన షెడ్లు లేక వంటవారు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- రక్షణ గోడలు (Compound Walls): నగర పరిధిలోని కొన్ని పాఠశాలలకు సరైన ప్రహరీ గోడలు లేకపోవడం వల్ల అసాంఘిక శక్తులు, జంతువులు లోపలికి వచ్చే ప్రమాదం ఉంది. ఇది విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారింది.
- ఇతర మౌలిక వసతులు: తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుద్దీకరణ మరియు తరగతి గదుల మరమ్మతులు తక్షణమే చేపట్టాల్సి ఉంది.

కావున, గౌరవనీయులైన కలెక్టర్ గారు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యాశాఖ అధికారులకు (DEO) తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రార్థిస్తున్నాము. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు ఎండిన చెట్లను తొలగించి, కిచెన్ షెడ్లు, గోడల మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలిందిగా నమ్రతతో కోరుకుంటున్నాము.

ధన్యవాదాలతో,

1) Laxmi Annam Laxmi 49 డివిజన్ కార్పొరేటర్
2) K. Padma Kasre Padma 48 "
3) T. Anil Thota Anil 36 "
4) Banda Ramana Reddy 22 " కార్పొరేటర్స్.

**కరీంనగర్ టౌన్ జూన్8(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, తోట అనిల్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కర్రె పద్మలు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు కనీస వసతుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నెల 15 నుంచి పాఠశాలలను ప్రారంభించనున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సౌకర్యాలు, తరగతి గదుల మరమ్మత్తులు, మధ్యాహ్న భోజన వంటశాలల అభివృద్ధి, రక్షణ గోడల నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వృక్షాలు వర్షాకాలంలో, ఈదురుగాలుల సమయంలో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున వాటిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బీజేపీ కార్పొరేటర్లు కోరారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యా వాతావరణం కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

### ములుగు జిల్లా నమో యువ కాన్క్లేవ్ కన్వీనర్ కత్తి హరీష్ గౌడ్ డిమాండ్

**మల్లంపల్లి మండల ప్రతినిధి జూన్ 08 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ములుగు జిల్లా నమో యువ కాన్క్లేవ్ కన్వీనర్ కత్తి హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా 2020-21, 2021-22, 2022-23 నుంచి 2024-26 విద్యా సంవత్సరాల వరకు ఉన్న సుమారు ₹14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా పూర్తిగా విడుదల కాలేదని విమర్శించారు. ఈ పథకంపై ఆధారపడి చదువుకుంటున్న పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, మెమోలు పొందలేక ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల ప్రభావం కేవలం విద్యార్థులపైనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, బీఈడ్, లా, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలపై కూడా తీవ్రంగా పడుతోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యాసంస్థలు ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్నాయని పేర్కొన్నారు. విద్యపై పెట్టుబడి పెట్టడం అంటే రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టేనని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఖర్చుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడిగా ప్రభుత్వం చూడాలని సూచించారు. తెలంగాణ యువత భవిష్యత్తు, విద్యార్థుల చదువులు, వేలాది మంది ఉద్యోగుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యా రంగానికి ఊరటనివ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల తరఫున భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వానికి మీడియా ద్వారా హెచ్చరించారు. **హెడ్‌లైన్ ఎంపికలు: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి:** కత్తి హరీష్ గౌడ్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు: కత్తి హరీష్ గౌడ్ 14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలిఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే బీజేవైఎం ఆందోళనలు తప్పవు



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: మేయర్ కొలగాని శ్రీనివాస్

### - ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో పాల్గొన్న మేయర్...

**కరీంనగర్ టౌన్ జూన్8(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, ఫిర్యాదులు, వినతులను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు.



తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కార ప్రక్రియ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, గతంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పూర్తికాకపోవడంతో కొన్ని గృహాలు నిరుపయోగంగా మారాయని అన్నారు. ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న మేయర్, వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో



మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అధికారులకు సమర్పించారు.

## రామసముద్రం చెరువు కట్ట మరమ్మతులు నిర్వహిస్తున్నారు

● పనులను చేపిస్తున్న గ్రామ సర్పంచ్ విసంపల్లి కవిత బాలకృష్ణ





**తొర్రూర్ ప్రతినిధి, జూన్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండలంలోని గుర్తూర్ గ్రామపంచాయతీ లోగల రామసముద్రం చెరువు గత వర్షాకాలంలో కట్టకు గండి పడింది. ఈ విషయాన్ని రైతులు గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా వారు పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రమాద స్థాయికి చేరుకున్న రామసముద్రం చెరువు కట్ట ఈ వర్షాకాలం వస్తే మరల తెగిపోయే అవకాశాలున్నందున గ్రామ సభలో సోమవారం రైతులు చెరువు కట్టకు మరమ్మత్తులు నిర్వహించాలని గ్రామ సర్పంచి కోరారు. గతంలో ఈ చెరువుకట్టను ఇరిగేషన్ అధికారులు కూడా తిలకించి వెళ్లారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామసభ అనంతరం సర్పంచ్ చొరవ తీసుకొని చెరువు కట్టకు జెసిబి సహాయం ట్రాక్టర్లతో మట్టి నేనింపేందుకు సిద్ధమయ్యారు. గుర్తురు గ్రామ ప్రజలకు సాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణ మరియు రైతాంగ అభివృద్ధికి ఎంతో కీలకమైన రామసముద్రం చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. చెరువు కట్ట బలోపేతం ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని సర్పంచ్ గారు తెలిపారు. గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమంమరియు జల వనరుల పరిరక్షణకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

## జమ్మికుంటలో ఈనెల 11న తలపెట్టినరైతు సమ్మేళనంను విజయవంతం చేయండి

### - సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్...

**జమ్మికుంట జూన్ 8(పీసీడబ్ల్యూ న్యూస్):** రైతాంగానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం కోసం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 11న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . సోమవారం రోజున జమ్మికుంటలో స్థానిక బిజెపి నేతలతో రైతు సమ్మేళన ప్రోగ్రాం కు సంబంధించి సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గంగడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (నాచురల్ ఫార్మింగ్ ) వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జమ్మికుంటలో జరిగే రైతు సమ్మేళన కార్యక్రమానికి కేంద్రమంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీ గంగా డి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి





సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, గుజ్జ శ్రీనివాస్, పుప్పాల రఘు, ఆకుల రాజేందర్, నరసింహ రాజు, సంఘ నరేష్, ముత్యాల జగన్ రెడ్డి, కులకాని రాజు, దొంతరమైన రమేష్ యాదవ్, బైరెడ్డి రమణారెడ్డి, బత్తిని నరేష్, రాకేం శ్రీనివాస్, తూర్పాటి రాజు, పోరెడ్డి కొండారెడ్డి, సంపెల్లి సంపత్ రావు, ఇండ్ల ప్రభాకర్, టంగుటూరి రాజ్ కు మార్, కేవిడ కుమార్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో పాత ఓటర్ సెర్చ్ వ్యవస్థ పునరుద్ధరించాలి

### - ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేయాలి: ఎంఐఎం డిమాండ్...



**కరీంనగర్ టౌన్ జూన్ 8(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ సందర్భంగా ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా మజ్లిస్-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఎంఐఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదేశాల మేరకు పార్టీ ప్రతినిధులు, ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ (హాఫిజ్ యూసుఫ్), మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్ మొహియుద్దీన్ బాబా జానీ, అన్మల సురేష్, ఖుస్రూ షాఖాన్, అరుణ్ తదితరులు కలెక్టర్‌ను కలిసి తమ విజ్ఞప్తులను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో అమలులో ఉన్న ఎస్ఐఆర్-2002 ఓటర్ సెర్చ్ పోర్టల్ ద్వారా పేరు, ఇంటి నంబర్, ఈపీఐసీ (ఎపిక్) నంబర్, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ ఆధారంగా ఓటర్ల వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉండేదని తెలిపారు. అయితే ప్రస్తుతం అమల్లో ఉన్న కొత్త వ్యవస్థలో ఈ ప్రాథమిక సెర్చ్ సదుపాయాలను తొలగించడం వల్ల సాధారణ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలో సమర్థవంతమైన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ లేకపోవడంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఫిర్యాదులు, సాంకేతిక సమస్యలు, సమాచార అభ్యర్థనలకు తక్షణ పరిష్కారం కల్పించాలని కోరారు. అలాగే గతంలో ఉన్న పాత ఓటర్ సెర్చ్ వ్యవస్థను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు కీలక అంశాలపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, అవసరమైన సిఫార్సులను ఎన్నికల కమిషన్‌కు పంపించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**- నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లులు**

**- రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**







**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.సోమవారం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. కేవలం ఇళ్ల మంజూరుతోనే బాధ్యత ముగిసిపోయిందని భావించకుండా నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని తెలిపారు.రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.రాజుపేట గ్రామంలో మంజూరైన గృహాల్లో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని, గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఈ లక్ష్యంతోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామని వెల్లడించారు.అర్హులైన చివరి లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.నూతనంగా ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇంట్లో సుఖ సంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు పట్టణంలో మారుమూల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు



**తొర్రూరు ప్రతినిధి, జూన్ 8(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో జిల్లా ఎస్పీఆదేశాల మేరకు, తొర్రూరు డిఎస్పీ సూచనలతో, సిఐ ఆధ్వర్యంలో తొర్రూరు సర్కిల్లో గల ఎస్సై లందరూ మారుమూల ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మారుమూల ప్రాంతాలలో జన సంచారం లేని ప్రాంతంలో గంజాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు . సిబ్బంది కలిసి తొర్రూరు పట్టణంలోని మారుమూల ప్రాంతాలు జనసంచారం లేని ప్రాంతాలలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ఇట్టి ప్రాంతాలలో కనిపించిన అనుమానిత వ్యక్తులను మరియు ప్రాంతాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో ముమ్మర తనిఖీలు , పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతున్నది.

# అడ్మిషన్లు ప్రారంభం: ప్రత్యేక అధికారి సుమలత



**చిట్యాల,8 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రత్యేక అధికారి సుమలత తెలిపారు. వారు మాట్లాడుతూ, ఏడవ తరగతిలో 10 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ కోర్సులో 20 సీట్లు, ఎంపీడబ్ల్యూహెచ్ కోర్సులో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారి సుమలత తెలిపారు.చిట్యాల కేజీబీవీ ఐఓఈగా ఎంపికైనట్లు పేర్కొంటూ, సీఈసీ విద్యార్థులకు న్యాయవాద వృత్తి కోర్సులు అయిన లా సెట్, సి.ఎల్.ఏ.టి వంటి పరీక్షలకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తిచేసిన బాలికలు నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని ప్రత్యేక అధికారి సుమలత తెలిపారు.

# అనుమతుల్లేని కళాశాలలపై ఉక్కుపాదం మోపాలి: పీడీఎస్‌యూ

**- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి**

**- ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి**




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న అనుమతుల్లేని ప్రైవేటు కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్రమంగా నడుస్తున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దయాకర కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ, జూన్ నెలలో విద్యాసంస్థలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి నడుస్తున్న ఇటువంటి సంస్థలను గుర్తించి వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ విద్యాసంస్థలపై ఆధారపడుతుంటే, వాటి అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమన్నారు. విద్య హక్కు అయినా, నేడు అది భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రకటించిన ఫీజుల నియంత్రణ చట్టం ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం వల్ల ప్రైవేటు కళాశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆర్థికభారం తగ్గించాలని కోరారు. గురుకుల విద్యాసంస్థలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతుండటం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేసి వారి ఉన్నత విద్యకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తూ అక్రమంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న పీడీఎస్‌యూ, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు విశ్వంత్, గాంధీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం: సీనియర్ నేతలను ఆత్మీయంగా కలిసిన పోట్రు అర్జున్ రావు



**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన పోట్రు అర్జున్ రావు పార్టీ బలోపేతం దిశగా తన పర్యటనలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పెద్ద కోరుకొండి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మత్స్యశాఖ సొసైటీ జిల్లా మాజీ అధ్యక్షులు మరుసకట్ల బాలరాజు ను ఆత్మీయంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోట్రు అర్జున్ రావు కి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీనియర్ నాయకుడు మరుసకట్ల బాలరాజు ను మర్యాదపూర్వకంగా కలిసిన అర్జున్ రావు పార్టీ అభివృద్ధి, గ్రామ స్థాయిలో కాంగ్రెస్ బలోపేతం, కార్యకర్తల ఐక్యత వంటి అంశాలపై చర్చించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న సీనియర్ నాయకుల అనుభవం యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మరుసకట్ల బాలరాజు, పసుపులేటి రాజు, తడికమళ్ల రాధాకృష్ణ కలిసి పోట్రు అర్జున్ రావు ని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆయన విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని నాయకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మించారు మధ్యలో వదిలేశారు

**• ఇబ్బంది పడుతున్న ప్రజలు**

**• ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఎలుకటి రాజయ్య.**



**చిట్యాల జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం నైన్‌పాక గ్రామ శివారులో నేరేడుపల్లి మధ్యలో మోరంచ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి కలగానే మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ ( టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ 2022లో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు పూర్తి కాకపోవడం ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.బ్రిడ్జి పూర్తయితే భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకోవచ్చని ఆశించిన ప్రజల ఆశలు అడియాశలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి పనులు నిలిచిపోవడంతో ప్రజలు సుమారు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా స్థానిక శాసనసభ్యులు, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# 12,14వ వార్డు సభ ఘనంగా నిర్వహణ

**- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: కౌన్సిలర్ రేష్మ ఇంతియాజ్**




**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సోమవారం వార్డు సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి 14వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ రేష్మ ఇంతియాజ్, 12వ వార్డు కౌన్సిలర్ ఇస్మాయిల్, వార్డు ఆఫీసర్ సుధారాణి, బిల్ కలెక్టర్ జగతి, ఏఎన్ఎం రజిని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మున్సిపాలిటీ సిబ్బంది మరియు వార్డు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డులోని మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, సామాజిక భద్రతా పెన్షన్ల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలకు వ్యాక్సిన్లు సకాలంలో వేయించాల్సిన అవసరాన్ని వివరించారు. 12వ వార్డు కౌన్సిలర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. 14వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ రేష్మ ఇంతియాజ్ మాట్లాడుతూ వార్డులో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెన్షన్ పథకాలు సహా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన పేద కుటుంబానికి అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలు తమ సమస్యలను సభలో ప్రస్తావించగా, సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

# వేములవాడలో విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**వేములవాడ, జూన్ 8(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆదివారం వేములవాడ పుణ్యక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మేకల మాధవి, ఉత్తర తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కారుపాకల కలమున్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గౌరవార్థం కేకే కమిటీ ఏర్పాటు చేసినందుకు కమిటీని స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గౌరవ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ యాత్రలో ప్రతి ఉద్యమకారుడు భాగస్వామి కావాలని కోరారు.ఆదిలాబాద్ నుంచి అలంపూర్ జోగులాంబ పుణ్యక్షేత్రం వరకు 101 కారులతో నిర్వహించే విజయ సంకల్ప యాత్రలో తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వనజ, సత్యలక్ష్మి, శారద, ఎల్లవ్వ, వేములవాడ మండల అధ్యక్షుడు తలారి రవి తదితరులు పాల్గొన్నారు.



# న్యాయబద్ధమైన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..

**- పాలేరు నియోజక వర్గంలో 14 క్లస్టర్లలో విజయవంతంగా ప్రజా దర్బార్ నిర్వహణ**

**- రెండవ విడతలో ప్రతి నియోజకవర్గానికి మరో 2 వేల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు**

**- ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి**







**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలోభాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 14 క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 13 క్లస్టర్లలో విజయవంతంగా కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 15 డివిజన్లకు సంబంధించి చివరి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ఈరోజు మాత్రమే సుమారు 3,500 దరఖాస్తులకు పైగా రానున్నట్లు తెలిపారు. చివరి దరఖాస్తు స్వీకరించే వరకు తాను స్వయంగా ఇక్కడే ఉండి ప్రజల వినతులు స్వీకరిస్తానని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాన ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు ఇప్పటి వరకు 66 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రతి సోమవారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.రెండవ విడతలో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి మరో 2 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. అనంతరం మూడవ, నాలుగవ విడతల్లో కూడా ఇళ్ల మంజూరు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.ప్రజా దర్బార్ కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకు 21,536 దరఖాస్తులు అందాయని, అందులో అత్యధికంగా 9,731 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసమే వచ్చాయని తెలిపారు. పెన్షన్ల కోసం సుమారు 4,700 దరఖాస్తులు, భూ సమస్యలకు 4 వేల దరఖాస్తులు, గృహజ్యోతి పథకం కోసం 900 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరగడం వల్లే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని అన్నారు. కొద్ది రోజుల్లో ఆసరా పెన్షన్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. రాబోయే నెల రోజుల్లో పాలేరు నియోజక వర్గ పరిధిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో నేడు ప్రజా దర్బార్ లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 5 వేల మంది వరకు ప్రజలు దరఖాస్తు సమర్పించేందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో నిర్వహించిన 13 ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో వచ్చిన ప్రతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు నాగమణి, రోజా మాట్లాడుతూ... గతంలో సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో తమ కుటుంబాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందడం వల్ల తమపై ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డి.ఎఫ్.ఓ. అనూజ్ అగర్వాల్, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మెన్ నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పీజీ ధరల పెంపుపై కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

**• ఖాళీ సిలిండర్లు, కట్టెల పొయ్యితో కాంగ్రెస్ వినూత్న నిరసన • ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ వంటా వార్పు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు • విశ్వగురు అంటూ ప్రజలపై ధరల భారం మోపుతున్న మోదీ - ఎమ్మెల్యే మేడిపల్లి • రాహుల్ గాంధీ హెచ్చరించినట్లే ధరలు పెంచుతున్న మోదీ: కాంగ్రెస్ - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం • మోదీ సర్కార్ పేదోడి పొట్ట కొడుతోంది: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ధ్వజం • 400 నుంచి 1200కు గ్యాస్ ధర ఇదేనా అచ్చే దిన్? - కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ • రాష్ట్ర బీజేపీ ఎంపీలు నోరు విప్పండి లేకుంటే దద్దమ్మలే: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి • గ్యాస్ ధర రూ.29 పెంపు బీజేపీపై కాంగ్రెస్ నేతల ఫైర్ • ఉజ్వల పథకాన్ని ఉత్త పథకంగా మార్చిన మోదీ: అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ • ఎల్.పి.జి ధరల పెంపుపై జిల్లా కాంగ్రెస్ నిరసన**



**కరీంనగర్ టౌన్ జూన్ 08(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలోని ఎన్‌డీఏ నేతృత్వ బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్‌పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా నేడు కరీంనగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన, వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఖాళీ సిలిండర్లతో, బీజేపీ వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కాంగ్రెస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడారు: గత నెల రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశంలో ఉన్న పేద మధ్యతరగతి ప్రజలంపైన రక్షకట్టినట్లుగా విపరీతమైన ధరలను పెంచుతూ పరిస్థితులను మనం చూస్తున్నాము.. పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు నిన్న ఎల్పిజి గ్యాస్ ధర ఒకేసారి 29 రూపాయలు పెంచి పేద ప్రజలపై భారం మోపుతున్న నరేంద్ర మోడీ సర్కారుకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపుమేరకు వారు మొదటి నుండి చెబుతున్నట్లుగా ఈ ఎన్నికల తర్వాత నరేంద్ర మోడీ దేశ ప్రజలపై ధరల పెంపు భారం మోపబోతున్నారని దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ మోసపూరిత కేంద్ర ప్రభుత్వంపై మనమందరం పోరాడటానికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ గారు హెచ్చరించినట్లుగానే ఎన్నికలు మోయగానే ఇప్పుడు ఇంధన ధరలు పెంచి వాటి ప్రభావం నిత్యవసరాలు పై పడటంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు, ఒకవైపు నరేంద్ర మోడీ నేను విశ్వగురు అని ఇది వికసిత భారత్ అని ప్రచారం చేసుకుంటూనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అంటగడుతూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ ధరలను దించేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని ఇట్టి పరిస్థితుల్లోనూ మోడీ సర్కార్ కు బుద్ధి వచ్చే విధంగా మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.ప్రతి విషయంలో ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు తమ నోరు విప్పాలని డిమాండ్ చేస్తున్నాము పెట్రోల్ డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై విపరీతమైన భారం పడుతుంటే మీరు నోరు విప్పకుంటే మంచిది కాదని ఇక్కడున్న కేంద్రమంత్రి పార్లమెంట్ సభ్యులుతో పాటు రాష్ట్రంలో ఉన్న ఎంపీలు ఏం పీకుతున్నారు అని ప్రశ్నిస్తున్నాం, ప్రతి విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసే మీరు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని, ఇప్పటికైనా ప్రజలు మిమ్మల్ని క్షమించాలంటే మీ నోరు విప్పాలని మోడీ అమిత్ షా ధరలను ఎందుకు పెంచుతున్నారని ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారని మేము బయట తిరగలేని పరిస్థితి ఉందని ఈ రాష్ట్ర ప్రజల పక్షాన ప్రశ్నిస్తారా లేక చేతకాని దద్దమ్మలుగా మిగిలిపోతారా తేల్చుకోవాలని ఈ సందర్భంగా బిజెపి నేతలను ప్రశ్నిస్తున్నాము అని అన్నారు. "మోదీ ప్రభుత్వం పేదోడి పొట్ట కొడుతోంది. 2014లో 400 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు 1200 దాటింది. సబ్సిడీ ఎత్తేసి ఉజ్వల పథకాన్ని ఉత్త పథకంగా మార్చారు. గ్యాస్ నింపుకునే స్థోమత లేక మళ్లీ మహిళలు కట్టెల పొయ్యిల వైపు చూస్తున్నారు. ఇదేనా మీరు తెచ్చిన 'అచ్చే దిన్'? వంటింట్లో మంట పెట్టిన బీజేపీని గద్దె దించే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదు. కేంద్రం వెంటనే ధరలు తగ్గించి పాత సబ్సిడీని పునరుద్ధరించాలి. లేకపోతే ప్రజాగ్రహం తప్పదు అని హెచ్చరించారు.కార్యక్రమం అనంతరం రాష్ట్ర పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్నీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం గారు జిల్లా కలెక్టర్ గారికి రాసిన వినతి పత్రం ను కార్యాలయంలో అందజేయడం జరిగిందిఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, మల్లికార్జున రాజేందర్,పులి ఆంజనేయులు గౌడ్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకుల నరసయ్య, మడుపు మోహన్,పర్వతం మల్లేశం, గంట శ్రీనివాస్ కళ్యాణి, పడాల అజయ్ గౌడ్, భాస్కర్ నాయక్, వెన్నం రజిత రెడ్డి,మామిడి సత్యనారాయణ రెడ్డి, అబ్దుల్ రహమాన్, అమీర్, భగవాన్ దాస్, వాయినాల సత్యనారాయణ, బండి శరణ్య, సత్తినేని శ్రీకాంత్, షబానా మహమ్మద్, వీర దేవేందర్, సిరిపురం లావణ్య నాగ ప్రసాద్, అస్తపురం తిరుమల, జల్లోజు శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య గౌడ్, మాదాసు శ్రీనివాస్, వజీర్, వసీం, శిల్ప, వేముల పుష్పలత, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, శ్రీరాముల రమేష్, నెల్లి నరేష్, సుదర్శన్, వహాబ్, పొన్నం మధు, పెంట శేఖర్, గోపు మల్లారెడ్డి, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హైమద్, మూల జైపాల్, నాగుల సతీష్, దండు రవీందర్, రామిడి తిరుపతి, సలీమ్ ఉద్దీన్, చింతల కిషన్, శారద, ఎలగందుల మునీందర్,ఈశ్వరి, ఇమామ్, కలిముద్దీన్, కాసెట్టి శ్రీనివాస్, కొట్టే ప్రభాకర్, బొబ్బిలి విక్టర్, గడప శ్రీనివాస్, అందే శంకర్, ఇమ్రాన్, ఊకంటి రవీందర్ రెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, జీడి రమేష్, జ్యోతి రెడ్డి, హసీనా, హర్ష మల్లేశం, వేల్పులవెంకటేష్, పోరండ్ల రమేష్, ములకల కవిత, కోడూరు రవీందర్ గౌడ్, కర్రె పావని, మీసా రమాదేవి, కొల గాని అనిల్ తో పాటు బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కార్యకర్త సభ్యులు యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్నేరు రిటైనింగ్ వాల్‌కు ఇరువైపులా మెట్లు నిర్మించాలి

**- మున్నేరు ఒడ్డుకు సురక్షిత మార్గం కల్పించాలి**

**- ప్రతిరోజూ వందలాది మంది స్విమ్మర్స్‌కు మెట్లు, రోడ్డు సౌకర్యం అత్యవసరం**

**- వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి... ఆశాభావంలో ఈత ప్రేమికులు**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉదయాన్నే ఆరోగ్య సాధన కోసం మున్నేరు జలాల్లో ఈత కొడుతున్న వందలాది మంది పురుషులు, మహిళలు, చిన్నారుల భద్రత దృష్ట్యా మున్నేరు రిటైనింగ్ వాల్‌కు ఇరువైపులా మెట్లు నిర్మించాలని ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోదాటి గిరిరాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం సాయంత్రం వరంగల్ క్రాస్‌రోడ్స్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. గురుదక్షిణ ఫౌండేషన్ సమీపంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌కు మెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఫౌండేషన్ గేట్ నుంచి మున్నేరు ఒడ్డువరకు సరైన రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కోదాటి గిరి మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సుమారు ఐదు వందల మంది ఆరోగ్య పరిరక్షణ కోసం మున్నేరు వద్దకు వస్తున్నారని తెలిపారు. అయితే రహదారి, మెట్ల సౌకర్యం లేక వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్నేరు అభివృద్ధి పనుల్లో భాగంగా రిటైనింగ్ వాల్‌కు ఇరువైపులా మెట్లు నిర్మిస్తే నీటిలోకి సురక్షితంగా వెళ్లే అవకాశం కలుగుతుందని, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించడం పట్ల స్విమ్మర్స్ హర్షం వ్యక్తం చేశారు.ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలు స్వచ్ఛందంగా చేపడుతున్న వ్యాయామ, ఈత కార్యక్రమాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అసోసియేషన్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంత్రి స్పందనతో త్వరలోనే మెట్లు, రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనకంచి వీరభద్రం, గౌరవ అధ్యక్షులు సిరిపురపు బుజ్జి, ఒకటో



వార్డు కౌన్సిలర్ చింతమళ్ల రవీందర్, కోశాధికారి కొమరగిరి సుమన్, ఉపాధ్యక్షులు తూము శ్రీనివాసరావు, షేక్ జానీమియా, సహాయ కార్యదర్శులు బొజ్జా ప్రసాద్, దామోదర్, రాంరెడ్డి, సీతారాములు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆరోగ్యం.. బిడ్డ భవిష్యత్తు






**- గర్భిణులకు భరోసాగా ప్రభుత్వ వైద్య సేవలు**

**- ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ నేడు ప్రతి గర్భిణీకి ఉచిత సమగ్ర ఆరోగ్య పరీక్షలు**

**- తల్లి చిరునవ్వు కోసం.. శిశువు సురక్షిత జననం కోసం వైద్యశాఖ ప్రత్యేక చర్యలు**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** గర్భంలో పెరుగుతున్న ప్రతి శిశువు ఆరోగ్యంగా జన్మించాలి.. ప్రతి తల్లి సురక్షితంగా ప్రసవాన్ని పూర్తి చేయాలి అనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ధనాలకోట రామారావు తెలిపారు. గత పదేళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం వేలాది మంది గర్భిణీలకు ఆరోగ్య భరోసాగా నిలుస్తోందన్నారు. గర్భధారణ సమయంలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, తల్లి-శిశు మరణాలను తగ్గించడం, హై-రిస్క్ గర్భధారణలను ప్రత్యేకంగా పర్యవేక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సమగ్ర వైద్య పరీక్షలు, రక్తపోటు, బరువు, రక్తహీనత పరీక్షలు, రక్తం-మూత్ర పరీక్షలు, గర్భస్థ శిశువు ఎదుగుదల అంచనా, అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ సేవలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రల పంపిణీ, పోషకాహారం మరియు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హై-రిస్క్ గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. గర్భిణీలు తప్పనిసరిగా తమ మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు వెంట తీసుకురావాలని, కనీసం నాలుగు ఏఎన్‌సీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు తీసుకువచ్చి ఉచిత సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. "సురక్షిత మాతృత్వం.. ఆరోగ్యకరమైన శిశువు" లక్ష్య సాధనలో ప్రతి గర్భిణీ భాగస్వామి కావాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విలువైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. డి. రామారావు విజ్ఞప్తి చేశారు.

# ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్‌కు కుమ్మరి సంఘం ఘన సన్మానం

**• కుమ్మరి సంఘం షాద్ నగర్ అధ్యక్షుడు నడికూడా శ్రీశైలం ఆధ్వర్యంలో కార్యక్రమం**



**షాద్ నగర్, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన రాయికల్ కుమ్మరి శ్రీనివాస్‌ను షాద్‌నగర్ కుమ్మర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు నడికూడా శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... కుమ్మర సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు ఉన్నత పదవికి ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ, సమాజ గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించి, కుల గౌరవాన్ని కాపాడాలని ఆశీర్వదించారు. మీ నాయకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రాయికల్ కుమ్మరి శ్రీనివాస్‌ను సన్మానించిన షాద్‌నగర్ కుమ్మర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికూడా శ్రీశైలం మరియు కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంజర్ల రమేష్, వైన్స్ అంజయ్య, సాయిలు, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, కోశాధికారి కృష్ణ, లక్ష్మయ్య, రాపోల్ వెంకటేష్, భిక్షపతి, మొగిలిగిద్దా పుల్లయ్య, కృష్ణ ఆంజనేయులు, వెంకటేష్, ఎక్లాస్‌కాన్‌పేట్ వెంకటయ్య, విష్ణు, విట్టల్,టికు,ఆటో శ్రీనివాస్, దూసకల రమేష్, తంగాలపల్లి బాలరాజ్, రాంచందర్, రాజశేఖర్, మల్లేష్,టికు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అద్దె ఇల్లు నుంచి విముక్తి కల్పిస్తాం

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేదల జీవితాల్లో వెలుగు**

**సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్**

**ఇంటి ఆడపడుచు బ్యాగరి చంద్రమ్మకు సారె అందజేసిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్**





**కొత్తూర్, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత పది సంవత్సరాల నుండి పేదల సొంతింటి కల సహకారం కాలేదని,కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల తో కళా సహకారమవుతుందని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందని అన్నారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, వార్డు సభ్యులు కమ్మరి వేదాంత చారి,ఆర్ రాములు,కే మైబుజ్జి,మాధవి, అర్బాస్,మాధవి,మంద కుమార్, రమాదేవి,దేశాల శారద,కే శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# పోట్రు అర్జునరావుకు గ్రామాల్లో ఘన స్వాగతం

**అడుగడుగున బ్రహ్మరథం.. శాలువాలతో సన్మానాలు.. కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం**



**కల్లూరు, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన పోట్రు అర్జునరావుకు మండలంలోని పలు గ్రామాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. తెలంగాణ రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ తదితర కాంగ్రెస్ నాయకుల సహకారంతో మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అర్జునరావు గ్రామాల పర్యటన చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని బత్తులపల్లి, రాళ్లబంజరు (లక్ష్మీపురం), ఎర్రబంజరు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ శ్రేణులు అర్జునరావుకు ఘన స్వాగతం పలుకుతూ శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రతి గ్రామం లోనూ ఆయనకు లభిస్తున్న ఆదరణ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సందర్భంగా పోట్రు అర్జునరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం గ్రామ స్థాయి నుంచి కృషి చేస్తూ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యర్రబోయినపల్లి గ్రామ యువ నాయకుడు పోట్రు చక్రీ, ఏఎంసీ డైరెక్టర్ దొడ్డపునేని శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు యేగుపాటి రాంబాబు, రేపాకుల రామకృష్ణ, కొలికపోగు కృష్ణ, బోడా జ్యోతి, నల్లగట్ల రామకృష్ణ, తాళ్ల శ్రీనివాసరావు, బత్తులపల్లి సర్పంచ్ గుగులోతు ఉమా నాగరాజు, పిచ్చిరెడ్డి, యేసురెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటెడ్డి, వేల్పుల నానయ్య, రాళ్లబంజరు (లక్ష్మీపురం) సర్పంచ్ భూక్యా రవీంద్రబాబు, ఉపసర్ప ంచ్ గుగులోతు కృష్ణ, గణపతిరెడ్డి ప్రభాకరరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మాసోత్ వినోద్ కుమార్, ఇందిరా కమిటీ సభ్యురాలు విజయనిర్మల, నాగరాజు, గుమ్మడి రామారావు, నల్లగట్ల జమలయ్యతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మృగశిర కార్తె శుభాకాంక్షలు

**• కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**



**షాద్ నగర్, జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** మృగశిర కార్తె సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలకు మరియు కేశంపేట మండల ప్రజలకు కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మృగశిర కార్తె తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రకృతి అనుగ్రహంతో మంచి వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కోరారు. మృగశిర కార్తె ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్డు విస్తరణ కోసం సంతకాల సేకరణ కార్యక్రమం




**రామన్నపేట జూన్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట పట్టణంలోని సుభాష్ సెంటర్ నుండి మల్లికార్జున రైస్ మిల్ వరకు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని పట్టణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్ మాట్లాడుతూ రామన్నపేట పట్టణం గతం ఎంతో వైభవంగా ఉండి నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, దినదినంగా దిగజారుతూ పోతుందని, నాడు తాలుకగా నియోజకవర్గ కేంద్రంగా ఉండి, నేడు మండల హెడ్క్వార్టర్గా, మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న అభివృద్ధి మాత్రం శూన్యమని, ఊరు నుండి వలసలు వెళ్లిన జనాలు ఎప్పుడు వచ్చినా రామన్నపేట గత 50 ఏండ్ల క్రితం ఎట్లా ఉందో ఇప్పుడు అట్లాగే ఉందని వాళ్ళు విస్తుపోతున్నారు. దీనికి కారణం ఇక్కడున్న ప్రజలదా, పట్టించుకోని పాలకులదా అని వారు ప్రశ్నించారు. రామన్నపేట పట్టణం ఎటు చూసినా సమస్యల కూపంగా మారిందని, సరైన రోడ్లు, డ్రైనేజీలు,నీటి వ్యవస్థ సరిగా లేదని, ముఖ్యంగా ప్రధాన రహదారి అయినటువంటి సుభాష్ రోడ్డు ఇరుకుమయంగా మారిందని, ఒక బండి వస్తే మరో బండి వెళ్లే పరిస్థితి లేదని, ఏదైనా లారీ, బస్సు, పెద్ద వాహనం వస్తే ద్విచక్ర వాహనాలు, పాదచారులు సైతం పక్కకు ఆగి నిలబడాల్సిన పరిస్థితి నెలకొని ఉందని, షాపింగ్ చేసే ప్రజలు పార్కింగ్ స్థలం లేక వారి వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని, దీంతో ప్రమాదాల జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గత పాలకులు పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణ చేస్తామని హామీ ఇచ్చి అసంపూర్తిగా చేయడం జరిగిందని ఇప్పుడు వున్న నూతన ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని, రామన్నపేట పట్టణ కేంద్రంలో నిలకొని ఉన్న అనేక సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తగిన నిధులు కేటాయించి రామన్నపేట పట్టణమును అభివృద్ధి పరచాలని సిపిఎం రామన్నపేట పట్టణ కమిటీ పక్షాన వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గాదె నరేందర్, గొరిగే సోములు, ఆముద ఆంజనేయులు, అప్పం సంతోష్, బావండ్లపల్లి సత్యం, తరిగొప్పుల వెంకటరెడ్డి, గంజి అశోక్, పల్లె సత్యం, బోళ్ల వెంకన్న, కుందూరు వెంకటేశ్వర్లు, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.